క్లుప్తంగా

స్వర్ణకార సంఘం కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన స్వర్ణకార సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు పట్టణ స్వర్ణకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం రాత్రి స్థానిక ఒన్‌టౌన్‌లోని సీతారాం భర్తియా కల్యాణ మండపంలో నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొద్దూరి నాగభూషణం, చిట్టూరి త్రినాథ్, మరో 21 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ నగరంలో స్వర్ణకారుల సంక్షేమానికి ప్రతి ఒక్కరినీ కలుపుకుని పని చేస్తామని చెప్పారు. పేద స్వర్ణకారుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు వివాహాల నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేయడంతో పాటు చనిపోయిన స్వర్ణకారుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. వయసు పైబడిన పేద స్వర్ణకారులకు నెలనెలా పింఛన్ ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, స్వర్ణకార కల్యాణ మండప నిర్మాణాన్ని దాతల సహకారంతో అతి త్వరలోనే పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కెనాల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టివారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై చర్చిస్తారని పేర్కొన్నారు. సభ్యులు, మండల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నట్టు తెలిపారు.

డ్రెయిన్ కాదు.. పంట బోదే!

- గ్రామాలకు సాగు నీరు పారే బోదెలోనే వ్యర్థాల డంప్
- పేరుకుపోయిన గుర్రపుడెక్క
- పట్టించుకోని అధికారులు



మస్తాన్ మన్యం కాలనీ, చెంచుల కాలనీలకు వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు సాగు, చెరువులకు తాగు నీరు అందించే పంట బోదె పూర్తిగా కాలుష్య కారకంగా మారింది. సమీపంలోని కాలనీ వాసులు, తోపుడు బండ్లపై తినుబండారాలు అమ్మే వారు తమ చెత్త, వ్యర్థాలను పంట బోదేలో డంప్ చేస్తున్నారు. దీంతో బోదె మురికి కూపంగా తయారైంది. పంట బోదెను ప్రక్షాళన చేసి దిగువ గ్రామాలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలని దిగువ ప్రాంత ప్రజలు, రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రైతులకు వెతలు

కృష్ణా కెనాల్ నుంచి పాండురంగా థియేటర్ ప్రాంతంలో ప్రారంభమై వెలివెన్ను పేట, చెంచుల కాలనీ, మన్యం మస్తాన్ కాలనీలను ఆనుకుని దాదాపు రెండు కిలో మీటర్లు నగర పరిధిలో పంట బోదె ప్రయాణిస్తుంది. పాండురంగ థియేటర్ సమీపం నుంచి దిగువ గ్రామాలకు పంట బోదె ద్వారా నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేస్తున్నారు. మాదేపల్లి, శ్రీపర్రు, లింగరావు గూడెం, వేగేశ్వరపురం, మానూరు, మహేశ్వరపురం, కలకుర్రు తదితర గ్రామాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించడంతో పాటు ఆయా గ్రామాల్లోని చెరువులకు నీరు నింపుతారు. గతంలో ఈ చెరువుల నీటినే తాగు నీటిగా వినియోగించే వారు. చెరువులను నీటితో నింపే పనిని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఆయా పంచాయతీలు నిర్వహిస్తున్నాయి. ఈ బోదెను ప్రక్షాళనకు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టాల్సి ఉంది.



కృష్ణా కెనాల్ నుంచి గ్రామాలకు నీరు అందించే పంట బోదె



పంట బోదెలో పసర్లు దేలిన నీరు, ఇందులో ఇళ్లలో వచ్చిన చెత్త కవర్లు

అవగాహన కల్పించడంలో వైఫల్యం

ఏలూరు నగరం పరిధిలో ప్రారంభమై రూరల్ మండలానికి సాగు నీటిని అందించే పంట బోదెలో వ్యర్థాలు, చెత్తా చెదారం వంటివి వేయనీయకుండా అరికట్టడంలో నగర పాలక సంస్థ అధికారులు సైతం వైఫల్యం చెందారనే వాదనలు వినిపిస్తున్నాయి. వంతెన ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడం, ఇరిగేషన్ అధికారుల సాయంతో ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రక్షాళన చేయాలి



మా ప్రాంతానికి సాగు నీరు, చెరువుల్లో వాడకం నీరు అందించే పంట కాలువ పూర్తిగా మురికి కూపంగా మారింది. పదేళ్ల క్రితం ఈ కాలువ నీటినే గ్రామంలోని పంచాయతీ చెరువుల్లో నింపుకుని ఫిల్టర్ చేసిన తర్వాత తాగు నీరుగా వినియోగించే వారం. పంట కాలువ డ్రెయినేజీని తలపిస్తుండటంతో కనీసం వాడకానికి సైతం నీరు పనిచేయడం లేదు. ఈ కాలువను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలి.

– గారపాటి నాగేశ్వరరావు, మాదేపల్లి, ఏలూరు రూరల్ మండలం

అవగాహన కల్పించాలి



ఏలూరు రూరల్ మండల గ్రామాలకు సాగునీటిని తీసుకెళ్లే పంట బోదెను శుభ్రంగా ఉంచే విధంగా ప్రజలకు ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజలు కూడా తమ ఇళ్లలో వచ్చే వ్యర్థాలు, చెత్తలను కార్పొరేషన్ చెత్త బండ్లలో వేసే విధంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలి. ఇరిగేషన్, నగర పాలక సంస్థ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యకు పరిష్కారం చూపాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, ఏలూరు

వినియోగదారుల ప్రయోజనాలకే ప్రాధాన్యత



రైతు బజారును సందర్శించిన ఎమ్మెల్యే బడేటి చంటి

సాక్షి స్పందన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రైతు బజారు.. సమస్యలతో బేజారు అనే శీర్షికతో ఈ నెల 16వ తేదీన సాక్షిలో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే బడేటి చంటి స్పందించారు. సోమవారం ఉదయం ఆయన స్థానిక పత్తేబాద రైతు బజారును సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రైతు బజారు పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని రైతు బజారు ఎస్టేట్ అధికారి సుధాకర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బజారులో వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలిగించినా సహించేదిలేదన్నారు. తన పేరును వినియోగించుకుంటూ కొందరు దందాలు చేస్తున్నట్టు తన దృష్టికొచ్చిందని, అటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేటాయించిన దుకాణాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే వ్యాపారుల గుర్తింపు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతు బజారులో ఖాళీగా ఉన్న దుకాణాలను, నూతన షెడ్లులోని దుకాణాలను రైతులకు కేటాయిస్తామని, వారు అక్కడే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చే నిమిత్తం నగరంలో మరో రైతు బజారు ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని వివరించారు.

ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలంతా డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి అన్నారు. స్థానిక ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై బీఎంవీ రాజా మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మోసపూరిత, ఈ మెయిల్స్ పట్ల జాగ్రత్త వహించి నష్టపోకుండా ఉండాలని సూచించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, మేనేజర్ ఎం హైందవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి స్కీమ్స్ నమోదు చేసుకోవాలని కోరారు. ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పంకజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్లు వై.బాబురావు, ఎస్ అనిల్, బి.సుమంత్, బి.చెన్నారావు బ్యాంకు ఖాతా తెరవడం, లావాదేవీల నిర్వహణ, డిపాజిట్ ఖాతాలతో కలిగే అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ – రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మన్ స్కీం డిజిటల్ ట్రాన్సాక్షన్, ఇతర చెల్లింపు వ్యవస్థలపై మాట్లాడారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



పాత బస్టాండు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : బస్సులు నడిపే సమయంలో ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఏలూరు మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు సూచించారు. సోమవారం ఏలూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, క్లీనర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జిల్లా వ్యాప్తంగా రహదారి భద్రతా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏలూరు జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఉప రవాణా కమిషనర్ కార్యాలయం వద్ద రహదారి చిహ్నాలు, రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని అన్నారు. అనంతరం ఏలూరు పాత బస్టాండ్ వద్ద రోడ్డు సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించి హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న, రాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఆవశ్యకతను వివరించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి, జాతీయ రహదారి వారోత్సవాల కరపత్రాలను వాహన చోదకులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ బాబు, ప్రజ్ఞ, అజ్మీరా బద్దు, జమీర్, ఎస్ జగదీష్ బాబు, జి.స్వామి, కళ్యాణి, నరేంద్ర బాబు పాల్గొన్నారు.

చంద్రబాబు దావోస్ పర్యటనతో ప్రయోజనం శూన్యం

దెందులూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన ప్రచారానికి రూ.కోట్లు వెచ్చించడం సబబు కాదని, ఆయన పర్యటనతో ప్రయోజనం శూన్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి అన్నారు. సోమవారం ఆయన పోతునూరులో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి పరిస్థితులు మెచ్చేలా ఉంటే దావోస్‌లోనే కాకుండా ప్రపంచంలో ఏ ప్రాంతంలో నుంచి అయినా పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు ముందుకు వస్తారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీల అమలుపై సీఎం దృష్టి సారించడం లేదన్నారు. చంద్రబాబు ప్రజాధనాన్ని మీడియాకు, వివిధ టీవీ చానల్స్‌కు వెచ్చించి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - తిరుపతి	16.00	4830	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	10
ఏలూరు-బీహెచ్‌ఈఎల్	22.30	98502	00

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	32	బీన్లచిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	50
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	42	కంద	60
కాకర కాయలు	2836	బీట్‌రూట్	42
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	00	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	32	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
అనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

రైల్వే గేట్ల మూసివేతతో ప్రయాణానికి ఇక్కట్లు

- ఓ పక్క పాతూరు గేటు వద్ద అభివృద్ధి పనులు
- మరో పక్క భీమడోలు గేటు మరమ్మతులు
- ప్రజలకు అగచాట్లు తప్పేట్లు లేవు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కష్టమే



పాతూరు వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి

భీమడోలు: ఓ పక్క పాతూరు గేటు అండర్ బ్రిడ్జి పనులు సాగుతున్నాయి. మరో పక్క భీమడోలు రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల కోసం రైల్వే అధికారులు తాత్కాలికంగా మూసేస్తున్నారు. రైల్వే గేటు మంగళవారం నుంచి 30వ తేదీ వరకు మూత పడనుంది. దీంతో జిల్లా నలుమూలల నుంచి భీమడోలు మీదుగా ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకాతిరుమలకు వచ్చే భక్తులు, భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. వాహనాలన్నీ గుండుగొలను, కురెళ్లగూడెం నుంచి భీమడోలు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా భీమడోలు, పాతూరు నుంచి తాడేపల్లిగూడెం వైపునకు వెళ్లాలంటే సరైన మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. భీమడోలు, సూరప్పగూడెం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పాతూరు, పెదలింగంపాడు ప్రాంతాల్లోని పంట పొలాలకు వెళ్లాలంటే ఈ గేటును దాటి వెళ్లాలి. అభివృద్ధి, మరమ్మతుల పనులు నేపథ్యంలో మూసి వేసి ఉన్న గేట్లు దాటడం కష్టంగా మారుతోంది. దీనితో దాళ్వా సాగుకు కీలకంగా ఉన్న ఈ తరుణంలో ఆయకట్టు ప్రాంతాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు తప్పేట్లు లేవు.

నెలల తరబడి పాతూరు అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

జాతీయ, రాష్ట్రీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న పాతూరు రైల్వే గేటు అభివృద్ధి పనులు నెలల తరబడి సాగుతుండడంతో ప్రజల కష్టాలు అంతా ఇంతా కావు. ఈ వంతెన నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. దీనితో ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు వద్ద గేటు మూసేందుకు రైల్వే అధికారులు ఇక్కడ కొన్ని నెలల కితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టింది. ఆ పనులు వివిధ సాంకేతిక కారణాల రీత్యా నత్తనడకన సాగుతుండడంతో ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, ప్రజలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఐదారు నెలల్లో పూర్తి చేయాల్సిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం నేటికీ కొనసాగుతూనే ఉంది. దీని వల్ల సూరప్పగూడెం రైతాంగానికి చెందిన వ్యవసాయ భూములన్నీ పాతూరులో ఉండడంతో రైతులు నిత్యం ఈ గేటు దాటి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంది. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాతూరు వెళ్లే మార్గం లేక వారు నరకయాతనను అనుభవిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. దీని వారంతా అదనంగా 10 నుంచి 12 కిలో మీటర్ల దూరం ప్రయాణించి భీమడోలు, గుండుగొలను మీదుగా పాతూరు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇదీ ఇలా ఉండగా భీమడోలు రైల్వే గేటును అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు మూసి వేస్తుండడంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో భీమడోలు రైల్వే గేటు మరమ్మతులు చేపడితే ప్రత్యామ్నాయంగా పాతూరు గేటు మీదుగా రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం ఆ గేటు మీదుగా ఎటువంటి వాహనం వెళ్లే దారి లేదు. దీనితో ప్రత్యామ్నాయంగా వాహనాలు కురెళ్లగూడెం, గుండుగొలను మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. ఏది ఏమైనా 9 రోజుల పాటు భారీ వాహన చోదకులు చుక్కలు చూడడం ఖాయమని పలువురు అంటున్నారు.



పాతూరు రైల్వే గేటు వద్ద నడిచేందుకు వీలులేని దారి



మరమ్మతుల నేపథ్యంలో మూత పడనున్న భీమడోలు రైల్వే గేటు

ముందుగా సమాచారం ఇస్తే బాగుంటుంది



ప్రస్తుతం దాళ్వా సాగులో రైతులు నిమగ్నమయ్యారు. వారంతా పంట పొలాలకు ఎరువులు వేస్తున్నారు.ఈ తరుణంలో భీమడోలు రైల్వే గేటు మరమ్మతులు చేసే ఆలోచన ఉంటే రైల్వే శాఖ అధికారులు రైతులు, ప్రజలకు వారం రోజులు ముందుగా సమాచారం ఇస్తే బాగుంటుంది. పాతూరు గేటు వద్ద అభివృద్ధి పనులు చేస్తున్నారు. దీనితో భీమడోలు, పాతూరు గేటుల మీదుగా రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ప్రత్యామ్నాయంగా కురెళ్లగూడెం, గుండుగొలను మీదుగా ఆయకట్టు ప్రాంతాలకు రైతులు వెళ్లాలంటే రైతులు కిరాయి ఖర్చులు తడిసి మోపెడవుతాయి. రైల్వే శాఖ అధికారులు పునరాలోచించాలి.

– కుక్కల ప్రసాద్, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, భీమడోలు

హైవేపై సూచికల ఏర్పాటు



దెందులూరు : జాతీయ రహదారిపై గుండుగొలను వద్ద అధికారులు ప్రమాదకర డివైడర్ వద్ద సూచికలను ఏర్పాటు చేశా రు. డివైడర్ వెంటనే గుర్తించేలా రెండువైపులా మార్గం ఉందని తెలియజేసేలా సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆ ప్రాంతంలో తారు డబ్బా పడుకోబెట్టి ఉంచారు. ఈ డివైడర్ వద్ద ద్విచక్ర వాహన ప్రమాదాలు గతంలో ఎన్నో జరిగాయి. ఎట్టకేలకు స్పందించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వాహనదారులు గుర్తించేలా సూచికలను ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు

దెందులూరు: పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని పశు వైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు అన్నారు. సోమవారం దెందులూరు పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలు, లేగదూడలకు, పాడి పశువులకు నట్టల నివారణ మందు తాగిస్తామని తెలిపారు. పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తామన్నారు. 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు, వీటి పెంపకం పట్ల అవగాహన కలిగించే ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ అందాల ప్రదర్శనలో లేగదూడలకు ఖనిజ మిశ్రమ లవణాల ప్యాకెట్లు, మందులు అందించడంతోపాటు రైతులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లాలోని 27 మండలాల్లో మండలానికి రెండు టీములు చొప్పున ఏర్పాటు చేసి ఒక్కొక్క టీములో ఒక పశు వైద్యుడు, ఒక పారా వెటర్నరీ సిబ్బంది, పశువైద్య సహాయకులు, గోపాల మిత్రలు ఉంటారని తెలిపారు. ఈ క్యాంపులపై పోస్టర్లు, కరపత్రాలు సిద్ధం చేశామన్నారు. రైతులందరూ ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని పశువైద్యశాఖ జేడీ కోరారు.